
# కనుపించని మంటలు

ప్రతాప రవిశంకర్



ఆమె మళ్ళీ కనిపించింది.

కనిపిస్తుందని అనుకోలేదు. అసలు ఆ ఆలోచనే నా మనసులో లేదు. నేను కలుసుకోబోయే వ్యక్తుల గురించి ఆలోచిస్తున్నాను. నా ప్రక్కన అప్పుడు రాజేంద్రకూడా వున్నాడు.

టిక్కెట్లు తీసుకుని ప్లాటు ఫారం మీదికి వచ్చాము. ఈస్టుకోస్టు బయలు దేరడానికి సిద్ధంగా ఉంది. రైలు నిండా అంతగా మనుష్యులు లేరు. తెలిసిన వాళ్ళు ఎవరయినా కనపడతారేమోనని రైలు పొడవునా ఒకసారి ఇద్దరం కలిసే నడిచాము.

ఎవ్వరూ కనపడలేదు. చివరకు లేడీస్ కంపార్టుమెంటులో ఎక్కాము. అలా ఎక్కడానికి కారణం ఒక మగాడు. కిటికీ వారగా కూర్చుని ఏదో పత్రిక చదువుకుంటున్నాడు.

లోపలకు వెళ్ళగానే మూలగా కూర్చున్న ఆమెను చూడగానే ఆశ్చర్యమయింది.

అవును ఆమే. కిటికీలో నుంచి అవతల పట్టాల మీద రొదచేస్తున్న రైలు ఇంజన్ని, స్టేషన్ పంపు దగ్గర నీళ్ళు పట్టుకుంటున్న స్త్రీలను చూస్తూంది.

కావాలనే రాజేంద్రతో ఏదో మాట్లాడాను.

నా వయిపు చూసింది.

వెంటనే చూపును మరల్చుకుంది బయటకు.

ఆమెకు ఎదురుగా ఉన్న సీటుమీద ఇద్దరం కూర్చున్నాం.

ఆ సెక్షన్‌లో ఇంకెవరో ఇద్దరు ఆడవాళ్ళు కూర్చున్నారు. నేను రాజేంద్రతో కావాలనే ఒక అమ్మాయి గురించి మాట్లాడుతున్నాను. ఆమె అప్పుడప్పుడు నా వైపు చూసి మళ్ళీ దృష్టిని రైలింజను వైపు మరలుస్తూంది.

ఉన్నట్టుండి నా మాటలు ఆగిపోయాయి. ఇందుకు కారణం ఒక రైల్వే ఉద్యోగి. "మాస్టారూ" అని పిల్చాడు నన్ను. ఆయనవయిపు చూశాను.

"ఇది లేడీస్ కంపార్టుమెంట్. దిగాలి మరో చోటుకి వెళ్ళి కూర్చోండి" అన్నాడు బయటనే నిలబడి.

అయిష్టంగానే లేచి నిల్చున్నాను. ఆమెను వదిలి వెళ్ళాలంటే మనస్కరించలేదు. ఏమైనా విజయవాడ వెళ్ళేలోపల ఆమెతో మాట్లాడాలని నా ప్రయత్నం. కాని అది మధ్యలోనే చెడిపోయింది.

మేము దిగి పోతుండగా ఆమె నాకేసి ఎదోలా చూసింది. అప్పుడు ఆమె చేతులను చూశాను. రెండు చేతులు మధ్య ఒక లావుపాటి బుక్ ఉంది.

మరో కంపార్టుమెంటులో ఎక్కాము.

రైలు కదిలింది.

అప్పుడు నేను రాజేంద్రకు ఆమె గురించి చెప్పాను.

ఏమని చెప్పాను?

నిజానికి ఆమె ఎవరో నాకు తెలియదు. ఇంతకు ముందు కొన్నిసార్లు ఆమె నాకు కనిపించింది. ఆమె మొదటిసారిగా నాకు కనిపించినప్పుడే ఒక ప్రత్యేకమయిన వ్యక్తిగా కనిపించింది.

మూడేళ్ళ క్రితం దుర్గాప్రసాదుగారింట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు ఆమె నన్ను కలిసింది. అప్పుడు మేమిద్దరం మాట్లాడుకోలేదు.

పెళ్ళికి వచ్చిన అమ్మాయిలతో మాట్లాడుతూ అప్పుడప్పుడు ఆమె నాకేసి చూసిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. ఆమె నన్ను ఆకర్షించాలని ప్రయత్నించినట్టు అనిపించింది. నా వూహ నిజమో, కాదో నాకు తెలియదు.

రాత్రి ఒంటిగంటకు పెళ్ళయిపోయింది. వెంటనే వెళ్ళిపోయిందామె.

ఆ తరవాత నెల రోజుల వరకూ కనిపించలేదు.

నేను ఒక అద్దె ఇంటి కోసం వెతుకుతుండగా ఒక రోజున ఆమె రిక్షాలో వెళుతూ కనిపించింది. రిక్షాలో ఒక సూట్కేసు కూడా ఉంది. రిక్షా నన్ను దాటి వెళ్ళగానే గృహాన్వేషణ కార్యాన్ని వదిలి సైకిలు వేసుకుని ఆమె వెనకే బయల్దేరాను. ఆమె ఇల్లు ఎక్కడో తెలుసుకోవాలి.

ఆమె నా ప్రయత్నాన్ని గ్రహించినట్టుంది. కొన్ని మెలికలు తిరిగిన తరవాత రిక్షా ఒక ఇంటి ముందు ఆగింది. ఆమె సూట్కేసుతో దిగి ముందుకు నడిచింది. ఆ ఇంట్లోకి వెళుతుందేమో అనుకున్నాను. ఆమె దిగిన చోటున ఉన్న ఇల్లే వాళ్ళది అని నేనుకోవాలని ఆమె వూహ అయివుండవచ్చు. కాని అలా జరగలేదు. నేను ఆమెను వెంబడించాను. ఇంకో రెండు సందులు తిరిగి ఆమె ఒక ఇంట్లోకి చరచరా వెళ్ళిపోయింది. చాలా సేపు నేను ఆ సందు మొదట్లో నిలబడ్డాను. కాని ఆమె బయటకు రాలేదు. ఆమె ఉంటున్నది ఆ ఇంట్లోనే అనుకుని వెళ్ళిపోయాను. ఏదో ఏదో పెద్ద కార్యాన్ని సాధించిన తృప్తి కలిగింది.

ఇంతకీ ఆమె ఎవరు? ఏం చేస్తూ ఉంటుంది?

అప్పట్లో ఇలాంటి ప్రశ్నలకు జవాబులు దొరకలేదు.

రైలు విజయవాడ స్టేషనులో ఆగింది.

దిగాము.

టిక్కెట్లు ఇచ్చి బయటకు రాగానే ఆమెతో మాట్లాడుతున్న శివనారాయణ కనిపించాడు. అతను నాకు తెలుసు.

నాకు సంతోషం కలిగింది. శివనారాయణ ద్వారా ఆమె గురించిన వివరాలు తెలుసుకోవచ్చు.

నేను వాళ్ళ దగ్గర వచ్చేసరికి ఆమె అతన్నించి దూరంగా వెళ్ళి ఒక రిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చుంది.

శివనారాయణను పలకరించాను. అతను మంచి ఫొటోగ్రాఫర్. ఏవో ఫొటోలు తియడానికి వచ్చాడట.

"ఇప్పుడు నీతో మాట్లాడిన అమ్మాయి ఎవరు?" అడిగానతన్ని.

"రాణి"

"ఏం చేస్తూ ఉంటుంది?"

"ఏదో కాన్వెంటులో టీచరుగా చేస్తూంది."

"ఎక్కడ?"


" ఈ వూళ్ళోనే"

"రోజూ గుంటూరు నుంచి ఇక్కడికి వస్తుందా?"

"అవును" అన్నాడతను.

నాకు ఎందుకో ఆమె టీచరు ఉద్యోగం చేస్తున్నదంటే నమ్మశక్యం కాలేదు. ఆడుతూ పాడుతూ ఆమె తనని అలంకరించుకున్న తీరు.

మెడలో గోల్డు గొలుసుకు పెద్ద లాకెట్ . . . పువ్వుల జాకెట్టు . . . రంగు వెలిసిన టెర్లిన్ చీర. చేతులకు గాజులు లేవు. గుంటలుపడిన కళ్ళు. బుగ్గలమీద సన్నని మచ్చలు . . . సన్నగా పొడవుగా వుంది.




ఏడ్పు నుండి ఉల్లాసానికి

పెరిగే పాపలకు అజీర్ణం చేయడమనేది సహజం మీపాపను అజీర్ణంనుండి ఉపశమనాన్ని కల్గించి ఉల్లాసంగా ఉంచేందుకు బయో - సాల్‌ను నమ్మండి. ఇంకేమాత్రం ఏడ్పువుండదు.

బయో - సాల్‌కు కృతజ్ఞతలు చెప్పండి.

బయో-సాల్®

గ్రైప్ - మిక్చర్

మీ పాపలను సంతోషంగా మరియు ఉల్లాసంగా నుంచుతుంది.

జె. & జె. డిషేన్
ల్యాబొరేటరీస్ (ప్రై.) లిమిటెడ్
హైదరాబాద్, ఇండియా



"ఎందుకు ఆ అమ్మాయి గురించి ఇలా అడుగుతున్నావ్?" శివనారాయణ నవ్వుతూ అడిగాడు. అతడి నవ్వులోనే అతను నాకు అపార్థం చెప్పడనే విషయం అర్థమవుతుంది. అయితే శివనారాయణకు ఆమె ఏం చేస్తున్నదీ తెలిసుండాలి.

"ఏం లేదు. ఇంతకు ముందు ఒక పెళ్ళిలో ఆమె కలిసింది. తరవాత మళ్ళీ ఇదే చూడడం. అందుకని అడిగాను."

"అలాగా" అని వెళుతున్నానని పిటీ బస్సు రాగానే ఎక్కి వెళ్ళిపోయాడు శివ నారాయణ.

రాజేంద్ర, నేను ఒక రిక్షాలో ఎక్కాము.

నా ఆలోచనలన్నీ రాణి మీదే ఉన్నాయి. ఆమె లోతుకుపోయిన కళ్ళలో గూడు కట్టుకున్న విషాదమే నా కనుల ముందు అనుక్షణం కనిపిస్తూంది.

ఆమె నవ్వగా ఇంత వరకూ చూడలేదు.

జీవితంలో ఆమె నవ్వుట నోచుకోని మనిషా? వయసు చిన్నదే! ఇంత చిన్న వయసులోనే ఆమె ఎందుకలా ఉంటూంది. ?

ఆరోజంతా ఆమె గురించి ఆలోచిస్తూనే ఉన్నాను.

ఇంతలో విజయవాడ వెళ్ళిన పని కాలేదు. జీవనం అనేను చూశాన్న సంతృప్తి అయినా దక్కింది.

ఆ తరువాత చాలా రోజుల వరకూ నేను ఆమె గురించి ఆలోచించాను. రోడ్ల మీద నడుస్తున్నా ఆమె ఎక్కడయినా కనిపిస్తుందేమోనని చూడటం మొదలుపెట్టాను. కనిపించలేదు.

చివరకు ఇంతకు ముందు నేను చూసిన ఇంటికి వెళ్ళాను. ఆ ఇంట్లో ఎవరూ లేరు. తాళం పెట్టి ఉంది. ఆరా తీయగా ఆ ఇంటిని ఈ మధ్యనే ఎవరో స్టూడెంట్లు ఖాళీ చేసి వెళ్ళారని తెలిసింది.

ఇక ఆమె కనిపించదేమో అనుకున్నాను.

ఇలా అనుకున్న నాలుగు రోజులకే ఒక నేను రిక్షాలో వెడుతుండగా కాలువ పక్కగా ఉన్న ఒక గుడిసెలోకి వెళుతూ కనిపించిందామె.

నాకు ఆశ్చర్యమయింది.

ఆమె ఇలాంటి ఇంట్లో ఉంటుందా?

ఆ రోజు సాయంత్రం నేను కాలువ పక్కన అటు వైపు వెళ్ళాను. గుడిసె బయట చిక్కిపోయిన ఒక వితంతువు మూలుగుతూ పడుకుని ఉంది. ఆమె చాలా బలహీనంగా నాలో వయసాడు రోజుల్లో చనిపోయేలా కనిపించింది. పదమూడేళ్ళు దాటిన పిల్లలు ఇద్దరు, అప్పుడే ఒడిలో ఉన్న ఒక ఆడపిల్ల బయట ఆటలాడుతూ కనిపించారు. ఆ ముగ్గురు మగవాళ్ళలో ఒకరికీ ఒంటి కాలు లేదు.

వాళ్ళ ఉన్న స్థితి చూస్తే నాకు కళ్ళు తిరిగాయి. వీళ్ళందరినీ ఆమె పోషించాలేమో అనుకున్నాను.

ఆ రాత్రి నాకు భోజనం సహించలేదు.

ఇప్పుడు ఆమె చేస్తున్న పనేమిటో నాకు సంపూర్ణంగానే అర్థమయింది.

ఒళ్ళమ్ముకుంటూంది.

మన దేశంలో ఆడది తను బ్రతకటానికయినా, పరివారాన్ని బ్రతికించటానికయినా పెట్టుబడి లేని వ్యాపారం.

నా ఆలోచనా సరయినదేనని ఆ మరునాటి రోజునే తెలిసింది.

సాయంత్రం ఆరు గంటలప్పుడు నేను నా స్నేహితుడు సుబ్బరాజు ఇంట్లో కూర్చుని ఉన్నాం. సరిగ్గా అప్పుడే రిక్షాలో మా ఇంటి ముందునించి వెళుతూ కనిపించింది రాణి. . . . ఆమెను వాడికి చూపించి "నీకు తెలుసా ఆమె?" అనడిగాను

"ఇది నాకెందుకు తెలియదు? రాణి అని పేర్లు. . . డాన్ చీప్ . . . నైటుకి ఇరవై" అన్నాడు . . . .

సుబ్బరాజు చెప్పింది నిజమే అయినా నాకెందుకో ఆ మాటలు వినడం బాధనిపించింది.

ఆ తరవాత ఆమె అనుకోకుండా బస్టాపు దగ్గర రాత్రివేళ కనిపించింది . . . ఒక ఫ్రెండుని బస్సు ఎక్కించి వస్తున్నాను . . . ఆమె ఎక్కడి నుంచి వస్తుందో.

గబగబా నడుస్తోంది.

నేనూ అంతే వేగంగా నడిచి ఆమెను కలుసుకున్నాను

రోడ్డు వారగా ఆగివున్న రిక్షా దగ్గరకు వెళ్ళబోతోంది.

"ఏమండీ" పిల్చాను.

వెనక్కి తిరిగింది.

ఏమిటన్నట్లు చూసింది.

ప్రక్కనే నడుస్తూ అడిగాను—"నేను మీకు గుర్తున్నానా?"

"గుర్తున్నారు—ఒక పెళ్ళిలో కలిశాం" చిన్నగా అన్నది.

ఆమె అలా అన్నందుకు నాకు చాలా సంతోషమయింది.

తరవాత ఏం మాట్లాడాలో నాకు తెలియలేదు. ఎన్నో విషయాలు అడగుదామనుకున్నాను. కాని నాకు నోరు పెగిలి రాలేదు.

పాంటు జేబులోంచి పర్సు బయటకు తీశాను. అందులోని యాభై రూపాయల నోటును తీసి "ఇది ఉంచండి" అన్నాను ఆమె కందిస్తూ . . .

"ఇప్పుడు మీ వెంట వచ్చేదా?" అన్నది తీసుకోకుండానే.

నా గొంతు తడారిపోయింది.

"ఎందుకు?" అన్నాను.

"మీరీ డబ్బు ఎందుకిస్తున్నారు?"

"ఊరికే మీరు నాగదికి రానవసరం లేదు. . . . మీ పరిస్థితి నాకు తెలుసు. నన్ను కొంత సహాయం చెయ్యనివ్వండి. మంచి మనిషిగా — అంతే" గొణిగాను.

ఆమె ఇక నాతో ఏమీ మాట్లాడకుండా రోడ్డు మీద ఖాళీగా వెళుతున్న రిక్షాను ఆపి ఎక్కి వెళ్ళిపోయింది.

నా చేతిలోని యాభై రూపాయల నోటు అలాగే ఉండిపోయింది.

ఆమె అభిమానానికి విస్తుపోయాను . . .

ఎంత నిజాయితీ . . .

ఆమెకు సహాయపడాలంటే ఒక్కటే మార్గం.

ఆ రాత్రంతా బాగా ఆలోచించాను. తెల్లవారగానే సుబ్బరాజు గదికి వెళ్ళాను.

"ఏం బ్రదర్ ఇలా వచ్చావ్?" నవ్వుతూ అడిగాడు.

"పనుండే వచ్చాను"

"ఏమి?"

"రాణి కావాలి ఈ రాత్రికి"

"నిజంగానా!" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బరాజు. నేను ఎలాంటి మనిషినో అతనికి బాగా తెలుసు.

"నిజం"

"దానికేముంది, రాత్రి పది గంటలకు నీ గదికి పంపిస్తాను." నా భుజం తడుతూ అన్నాడు.

కొంచెం సేపు అతని గదిలో ఉండి తిరిగొచ్చాను.

ఆరోజు ఆఫీసులో పని సరిగా చెయ్యలేకపోయాను. రాత్రి నా గదికి వచ్చే రాణిని గురించే నా ఆలోచనలు.

ఎనిమిది గంటలకే హోటల్లో భోజనం చేసి గదికి వచ్చాను. సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ రాణి కోసం ఎదురు చూస్తున్నాను.

పది గంటలు దాటుతుండగా నా గది తలుపులను తట్టిన చప్పుడయింది.

తెరిచాను.

ఎదురుగా రాణి.

నన్ను చూడగానే ఆమె ముఖంలో ఆశ్చర్యం!!

"మీరా!"

"అవును" అన్నాను నవ్వుతూ.

నా గదిని పరిశీలిస్తూ అలాగే నిలబడిపోయింది.

"రా, ఇలా కూర్చో" అన్నాను కుర్చీ చూపిస్తూ.

"నేను కూర్చోను. మీరు నాకిచ్చే డబ్బు ఇలా ఇవ్వండి వెళ్ళిపోతాను" అన్నది.

"అదేమిటి!"

"అవును, మీరు నాకు సహాయం చేయటానికే పిలిపించారని తెలుసు ... అందుకోసం మీరు నీతి తప్పటం ఎందుకు? నా మూలంగా ఒక మంచి మనిషి ఈ రొంపిలో దిగటం నేను సహించలేను. అంతకంటే ఊరికే మీ దగ్గర్నించి ఆ డబ్బును సంతోషంగా తీసుకుంటాను" అన్నది.

చాలా సేపటి వరకూ ఏమీ మాట్లాడలేకపోయాను.

ఎంత విస్తృతమైన ఆలోచన!

పరిస్థితులే ఈమెను ఇలా దిగజార్చకుండా ఉన్నట్లయితే ఈమె ఎంతటి మహోన్నతమయిన స్త్రీ అయి ఉండేది.

టేబులు మీద పర్సు అందుకుని వంద రూపాయల నోటు తీసి ఆమెకు ఇచ్చాను. తీసుకుని తన హాండ్‌బాగ్‌లో పెట్టుకుంది.

తెరచి ఉన్న తలుపుల గుండా లోపలకు వస్తున్న గాలికి ఆమె ముంగురులు కదులుతున్నాయి.

ఆమె ముఖంలోకి పరీక్షగా చూశాను.

జీవంలేదు. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. . .

ఆమె చేతులు జోడించింది.

"నాదొక మనవి . . . మీరు ఇక ముందు ఇలాంటి పనులు చెయ్యకండి . . . నాలాంటి వాళ్ళకు సహాయ పడటానికి ప్రయత్నించండి. ఎందుకంటే ఈ దేశంలో నాలాంటి నిర్భాగ్యులు ఎంతోమంది ఉన్నారు. వాళ్ళందరికీ సహాయపడటం సాధ్యంకాని పని. మాలాంటి వాళ్ళను ఇలాగే కుళ్ళనివ్వండి. ఈ దేశంలో పరిస్థితులు మారనంత వరకూ మాలాంటి వాళ్ళ బ్రతుకులు ఇలా రంగు వెలిసిన బొమ్మల్లాగానే ఉంటాయి. ఇవి జీవం లేని బొమ్మలు, ఈ బొమ్మల పట్ల రవంత సానుభూతి ఉంటే అంతే చాలు" అంటూ నమస్కరించి వస్తున్న దుఃఖాన్ని బలవంతాన అపుకుని నా గదిలోంచి బయటకు పరుగుదీసిం దామె. *

సూపర్ బాల్ పెన్....
హాయిగా, మెత్తగా రాసేది.

కేమ్లిన్
121 జాటర్

లక్షలాది ప్రజల అభిరుచులకు అనువుగా ఉండేలా రకరకాల రంగులలో దొరుకుతుంది. ఈ ధరలో దొరికే బాల్ పెన్‌లలో దీనిని మించినది మరేది ఉంటుంది!




S 795 Tel